జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శుక్రవారం | 21-08-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 761 పేజీలు: 4 వెల: రూ.7

# పుర పోరు.. ప్రత్యక్షమే!















**☀ ఇక సింగిల్ వైస్ చైర్మన్ మాత్రమే ☀ హ్యాట్రిక్ కోసం రాజ్యలక్ష్మి తాపత్రయం ☀ ఎలాగైనా మున్సిపాలిటీ చేజెక్కించుకోవాలని యోచనలో టీడీపీ ☀ చైర్మన్ సీటు జనసేనకి కేటాయించాలని డిమాండ్ ☀ మున్సిపల్ సాంప్రదాయం కొనసాగించాలని ప్రయత్నిస్తున్న వైసీపీ ☀ ఆశవాహుల్లో కొంగొత్త ఆశలు**

ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త): మున్సిపాలిటీలో స్థానిక సంస్థల ఎన్నికలకు రాష్ట్ర ప్రభుత్వం పరోక్ష విధానం కాకుండా ప్రత్యక్ష విధానంలో చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు క్యాబినెట్లో మున్సిపాలిటీ సవరణ బిల్లును ఆమోదించారు. అలాగే అసెంబ్లీలో కూడా ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం లభించింది. అక్టోబర్ చివరి నాటికి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఒక్కసారిగా ఆశవాహల్లో కొంగొత్త ఆశలు రేకెత్తించాయి. గెలుపొటములపై ఎవరి ధీమా లో వారు ఉన్నారు. వరుసగా మూడోసారి మున్సిపాలిటీని కైవసం చేసుకోవాలని యోచనలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉండగా అదే సంప్రదాయస్థానం వరుసగా మూడోసారి చేజిక్కించుకొని హ్యాట్రిక్ విజయం సాధించాలని సిట్టింగ్ మాజీ చైర్పర్సన్ పిలక రాజ్యలక్ష్మి గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఎలాగైనా బోణీ కొట్టాలని తెలుగుదేశం పార్టీ గట్టి పట్టుదలతో ఉంది. పదే పదే మున్సిపాలిటీ చేజారుతున్నడంతో ఈసారి తీవ్ర ప్రయత్నాలు చేసి చైర్మన్ స్థానం దక్కించుకోవాలని తెలుగుదేశం పార్టీ భావిస్తుంది. ఇక పొత్తు ధర్మంలో భాగంగా మున్సిపల్ చైర్ పర్సన్ జనసేనకి ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు పట్టుబడుతున్నారు. ఒక్కో పార్టీ నుండి చైర్పర్సన్ అభ్యర్థులు ఆరడజనుకి పైగా రేసులో ఉన్నారు. గతంలో పరోక్ష పద్ధతుల ఉండడంతో ముందుగా చైర్పర్సన్ స్థానం ఆశించకుండా కౌన్సిలర్ స్థానంపై కన్నేసేవారు. 2005 తర్వాత పరోక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తుండంతో ఏకంగా చైర్మన్ సీటుపైనే కర్చీఫ్ వేసేందుకు ఉవ్విళ్ళూరుతున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే సిట్టింగ్ మాజీ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి పోటీలో ముందు వరుసలో ఉన్నారు. అయితే ఆమె ఇప్పటికే రెండుసార్లు ఈ పదవి చేపట్టడంతో మూడోసారి కొత్త వ్యక్తులకు ఇవ్వాలని మిగిలిన అభ్యర్థులు కోరుతున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జిగా రెడ్డికి సామాజిక వర్గం అభ్యర్థి ఉండడంతో మున్సిపాలిటీని యాదవ సామాజిక వర్గానికి కేటాయించాలని ఆ సామాజిక వర్గం కోరుతుంది. యాదవ సామాజిక వర్గం నుండి కేజిహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉలాల కోదండరాం చైర్మన్ టికెట్ ఆశిస్తున్నారు. ఇందుకు గాను ఏడాది ముందు నుండే తన ఉద్యోగానికి రాజీనామా చేసి స్థానికంగా వైద్య సేవలు అందిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిని ఇప్పటికే కలిసి తన మనసులోని మాట బయట పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఇదే కుటుంబం నుండి మున్సిపల్ మాజీ వైస్ చైర్పర్సన్ ఉలాల భారతి దివ్య కూడా చైర్పర్సన్ టికెట్ ఆశిస్తూ ఉండడంతో ఒక ఇంట్లో ఇద్దరు మధ్య సీటు కోసం పోటీపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో ఇరువురు మధ్య ఇంటి పోరు తప్పేటట్లు లేదని వాదన వినిపిస్తోంది. ఇక మరో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాజా మాజీ వైస్ చైర్పర్సన్ లాభాల స్వర్ణమని కూడా చైర్మన్ టికెట్ గట్టిగా ఆశిస్తున్నారు. తాను గతంలో బాగా పరిపాలించి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేశానని తనకు మరోసారి చైర్పర్సన్ గా అవకాశం అవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నారు. మరో వైపు తనపై సొంత పార్టీ వ్యక్తులు అవిశ్వాసం పెట్టి పదవి నుండి దింపే ప్రయత్నం చేయడం తో తనపై సానుభూతి పవనాలు వీస్తున్నాయని భావిస్తున్నారు. అదిష్టానం మాత్రం ఒకసారి పనిచేసే వ్యక్తులు కాకుండా కొత్త వ్యక్తులను బరిలో దింపాలని యోసిస్తున్నట్లు సమాచారం. స్వర్ణ భారతి విద్యా సంస్థల చైర్మన్ చాట్ల తులసీ దాస్ రెడ్డి చైర్మన్ స్థానంపై గట్టిగా కన్నేసినట్లు తెలుస్తోంది. తనకున్న ప్రజాధరణ సామాజిక సమీకరణాలు అన్ని వార్డుల్లో పరిచయాలు ఓటరు లలో బలం నేపథ్యంలో తనకు సీటు ఇస్తే గెలిచి కానుక ఇస్తానని అంటున్నారు. ఇక మైనార్టీలు కూడా తమకు ఒక అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. మరి కొంతమంది కూడా చైర్పర్సన్ స్థానం ఆశించినప్పటికీ బహిరంగంగా ముందుకు రాకుండా తెరవెనుక ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇక తెలుగుదేశం పార్టీ విషయానికి వస్తే పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు పత్రి తవిటయ్య చైర్పర్సన్ సీటుపై గట్టి ఆశతో ఉన్నారు. పార్టీ అధిష్టానం అండతో తనకు సీటు ఇస్తే మున్సిపాలిటీని తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకుని ఎలాగైనా తెలుగుదేశం జెండా మున్సిపాలిటీలో ఎగుర వేసేందుకు కృషి చేస్తానని అత్యధిక సీట్లు వార్డుల్లో కూటమి ఖాతాలో వేస్తామని అంటున్నారు. ఇప్పటికే ఏడాదిగా పట్టణ అధ్యక్ష పదవితో తన మార్కు పార్టీ కార్యక్రమాలతో ముందుకు వెలుతున్నట్లు చెప్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుండి పది మంది వరకు చైర్ పర్సన్ సీటు కోసం పోటీ పడుతున్నారు. నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ యాదవ్ కూడా టికెట్ ఆశిస్తున్నారు. తనదైన శైలిలో సోషల్ మీడియా ద్వారా ప్రజల్లోకి పార్టీని తీసుకువెళ్తున్నారు. జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి 11వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆశి లీలా రాణి చైర్పర్సన్ స్థానాన్ని ఆశిస్తున్నారు. రెడ్డికి సామాజిక వర్గం నుండి తెలుగుదేశం పార్టీ నుండి మహిళ విభాగం నుండి తనకు సీటు కేటాయించాలని కోరుతున్నారు. వీరే కాకుండా మరో నలుగురు కూడా చైర్పర్సన్ సీటును ఆశిస్తున్నారు. ప్రస్తుతం వార్డుల సంఖ్య 28కి పెరగగా ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. చైర్పర్సన్ స్థానం ఏ రిజర్వేషన్ వర్తిస్తుందో ఇంకా తెలియ రాలేదు. వరుసగా మూడుసార్లు మహిళ రిజర్వేషన్ కావడంతో ఈసారి జనరల్ లేదా బీసీ జనరల్ కు కేటాయిస్తారని భావిస్తున్నారు. రెండు పార్టీల నుండి మరో ఇద్దరు మైనార్టీల పేర్లు కూడా గట్టిగా వినిపిస్తున్నాయి. మొత్తానికి ఏ పార్టీలో ఎవరికి సీటు దక్కుతుందో వేసి చూడాలి.



ఎర్రచెరువు కాలువ..

## భూమికి రెక్కలు

**✳ రూ.50 లక్షల విలువైన స్థలం ఆక్రమణకు యత్నం?**

**✳ మున్సిపల్, రెవెన్యూ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం**

పలాస, ఆగస్టు 20 (వార్త): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ, చెరువు, కాలువ భూముల ఆక్రమణలపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలోని ఎర్రచెరువు కాలువలో కొంత భాగాన్ని ఆక్రమించి భవన నిర్మాణం చేపడుతున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. భూముల ధరలు పెరగడంతో చెరువులు, వరద కాలువలను సైతం వదలడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం సర్వే నంబర్లు 25, 29, 43, 44, 45, 46లోని కొంత భూమి కాలువ పరిధిలోకి వస్తుందని, ఆ ప్రాంతంలో నిర్మాణ పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు. సుమారు రూ.50 లక్షల విలువైన స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నం జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై వారు ప్రశ్నిస్తున్నారు. నెమలికొండ, సూదికొండ తదితర ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు వరద నీరు ఎర్ర కాలువ ద్వారా పురుషోత్తపురం సాగరానికి చేరుకునే ప్రధాన మార్గంగా ఈ కాలువ ఉండేదని స్థానికులు చెబుతున్నారు. కాలక్రమేణా కాలువలోని అధిక భాగం ఆక్రమణలకు గురై ఇళ్ల స్థలాలుగా మారిపోయిందని ఆరోపిస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే భారీ వర్షాల సమయంలో వరద నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి దిగువ ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువలో నిర్మాణ పనులు జరుగుతున్నప్పటికీ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చినా క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి వాస్తవ పరిస్థితులను వెల్లడించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. కాలువ హద్దులను సర్వే చేసి, ప్రభుత్వ భూమి లేదా వరద ప్రవాహ మార్గం ఆక్రమణకు గురైందా? నిర్మాణానికి అనుమతులు ఉన్నాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై పర్యావరణ ప్రేమికులు, స్థానికులు రాష్ట్ర అభివృద్ధి అధికారులు, జిల్లా కలెక్టర్, అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధపడుతున్నట్ల తెలుస్తోంది.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# పలాసలో ఆధునిక వీధి దీపాలకు శ్రీకారం

- ఈఈఎస్ఎల్‌తో మున్సిపాలిటీ ఒప్పందం
- విద్యుత్ ఆదా..
నిర్వహణ బాధ్యత సంస్థదే
- మున్సిపాలిటీపై అదనపు ఆర్థిక భారం లేకుండా పథకం




**పలాస, ఆగస్టు 20 (వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘంలో వీధి దీపాల వ్యవస్థను ఆధునీకరించేందుకు మున్సిపాలిటీ కీలక నిర్ణయం తీసుకుంది. పట్టణంలోని ప్రస్తుత వీధి దీపాల స్థానంలో ఆధునిక ఎల్ఈడీ దీపాలను ఏర్పాటు చేసి, వాటి నిర్వహణను సమర్థంగా చేపట్టేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్ (ఈఈఎస్ఎల్)తో మున్సిపాలిటీ ఒప్పందం కుదుర్చుకుంది. విశాఖపట్నంలోని వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (ఆర్‌డీఎంఏ) వి. రవీంద్ర సమక్షంలో పలాస మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, ఈఈఎస్ఎల్ ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. విద్యుత్ వినియోగం తగ్గింపు ఒప్పందంలో భాగంగా పట్టణ పరిధిలో ఆధునిక ఎల్ఈడీ వీధి దీపాలను ఏర్పాటు చేయడంతో పాటు వాటి నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలను ఈఈఎస్-ఎల్ చేపట్టనుంది. సంప్రదాయ వీధి దీపాలతో పోలిస్తే ఎల్ఈడీ దీపాల వినియోగంతో విద్యుత్ ఖర్చు తగ్గే అవకాశం ఉంది. అదే సమయంలో పట్టణంలోని ప్రధాన రహదారులు, వీధుల్లో మెరుగైన వెలుతురు అందుబాటులోకి రానుంది. ఆదా అయ్యే మొత్తంతోనే చెల్లింపులు జరిపేందుకు ఈ ఒప్పందంలో ప్రధాన అంశంగా విద్యుత్ పొదుపు ద్వారా మున్సిపాలిటీకి ఆదా అయ్యే మొత్తాన్ని ఈఈఎస్ఎల్‌కు చెల్లించే విధానం రూపొందించినట్లు అధికారులు తెలిపారు. దీంతో వీధి దీపాల ఆధునీకరణ కోసం మున్సిపాలిటీపై అదనపు ఆర్థిక భారం పడకుండా వ్యవస్థను అమలు చేయడానికి అవకాశం ఏర్పడనుంది. నిర్వహణలోనూ మార్పు వస్తుండడంతో వీధి దీపాల ఏర్పాటు మాత్రమే కాకుండా వాటి నిర్వహణ, పర్యవేక్షణ కూడా ఒప్పందంలో భాగం కావడం వల్ల దీపాల పనితీరును నిరంతరం పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. దీపాలు పనిచేయకపోవడం, మరమ్మతులు వంటి సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు వ్యవస్థీకృత విధానం అందుబాటులోకి రానుంది. ఫలితంగా పట్టణ ప్రజలకు మెరుగైన వీధి వెలుతురు అందించడమే కాకుండా, మున్సిపాలిటీ విద్యుత్ వ్యయాన్ని నియంత్రించేందుకు అవకాశం కలుగుతుంది. పలాస పట్టణంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను ఆధునీకరించే చర్యల్లో భాగంగా ఈ ఒప్పందాన్ని చేసుకున్నారు. విద్యుత్ పొదుపు, మెరుగైన వెలుతురు, నిర్వహణలో సామర్థ్యం అనే మూడు అంశాలను సమన్వయం చేస్తూ ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నట్లు మున్సిపల్ అధికారులు వెల్లడించారు. ఒప్పందం అమలులోకి వచ్చిన అనంతరం పట్టణంలోని వీధి దీపాల వ్యవస్థలో గణనీయమైన మార్పులు కనిపించే అవకాశం ఉందని మున్సిపల్ డిప్యూటీ ఇంజినీర్ శ్రీకర్ తెలిపారు.

## రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం



**పలాస, ఆగస్టు 20 (వార్త):** రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. భారతరత్న, మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతిని పురస్కరించుకుని పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తంగుడు రమణయ్య, పీసీసీ డెలిగేట్ తంగుడు వీరారాజు, పార్టీ అభిమాని మహేష్ మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో రాజీవ్‌గాంధీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయడంతో పాటు సాంకేతిక రంగానికి ప్రాధాన్యమిస్తూ ఆధునిక భారతానికి బలమైన పునాదులు వేశారని కొనియాడారు. ప్రత్యేకించి సమాచార సాంకేతికత, టెలికమ్యూనికేషన్స్, విద్యా రంగాల్లో ఆధునీకరణకు ఆయన తీసుకున్న చర్యలు దేశ ప్రగతికి దోహదపడ్డాయని తెలిపారు. యువతకు అవకాశాలు కల్పించడం, దేశాన్ని సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లాలన్న ఆయన ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకమన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయాలను కొనసాగిస్తూ ప్రజాస్వామ్య విలువలు, సామాజిక సమానత్వం, దేశ ప్రగతి కోసం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చంద్రబాబు నిజమైన బీసీ పక్షపాతి

-రాష్ట్ర కళింగ కోమటి, కళింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూనా సంతోష్




**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు (బీసీలు) తిరిగి 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయంపై రాష్ట్ర కళింగ కోమటి, కళింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వూన సంతోష్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీసీ సమాజం తరపున చంద్రబాబు నాయుడు కి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ బీసీల వెన్నెముక అని ఈ నిర్ణయంతో మరోసారి రుజువైందని ఆయన పేర్కొన్నారు.గత ఐదేళ్ల చీకటి పాలనలో జీవో 559, 560 ద్వారా బీసీలు పడిన అవస్థలను, ప్రస్తుత చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కల్పిస్తున్న రాజకీయ స్వర్ణయుగాన్ని బీసీ సమాజమంతా గమనించాలి. బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడి, స్థానిక సంస్థల్లో సింహభాగం పదవులు కల్పించిన చంద్రబాబు నాయుడు గారి నాయకత్వానికి బీసీలంతా అండగా నిలవాలని వూన సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు.

### సంక్షేమ హాస్టల్ విద్యార్థుల

## మెస్ చార్జీలు పెంచాలి

**పలాస, ఆగస్టు 20 (వార్త):** సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థుల మెస్ చార్జీలను పెంచాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యు.) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం పలాస ఆర్డీఓ ఆర్ అప్పారావుకు సంఘం నాయకులు వినతిపత్రం రు అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన లక్షలాది మంది విద్యార్థులు సంక్షేమ హాస్టళ్లలో ఉంటూ విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. గత మూడేళ్లుగా మెస్ చార్జీలను పెంచకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారం అందడం కష్టంగా మారిందన్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను నెలకు రూ.3,000కు పెంచాలని కోరారు. ప్రస్తుతం 3, 4 తరగతుల విద్యార్థులకు రూ.1,150, 5 నుంచి 10వ తరగతి వరకు రూ.1,400, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు రూ.1,600 చొప్పున మెస్ చార్జీలు అందుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇటీవల 10 శాతం పెంపు ప్రకటించినప్పటికీ అది సరిపోదని, కనీసం 49 శాతం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ చార్జీలను వెంటనే విడుదల చేయాలని, గిరిజన పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో రెగ్యులర్ సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయడంతోపాటు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. నాయకులు విజయ్, దయ, చంటి తదితరులు పాల్గొన్నారు.



# సంస్కారహీనుడు అచ్చెన్న

- రాజకీయాల్లో సంస్కారం ముఖ్యం.. అహంకారం కాదు!
- 2029లో ప్రజల తీర్పే ఆయనకు సమాధానం
బొత్సపై అచ్చెన్నాయుడు వ్యాఖ్యలపై దువ్వాడ శ్రీధర్(బాబా) ఆగ్రహం



**పలాస, ఆగస్టు 20 (వార్త):** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీనియర్ ప్రజానాయకుడిగా, దశాబ్దాలుగా ప్రజాజీవితంలో కొనసాగుతున్న బొత్స సత్యనారాయణను వ్యక్తిగతంగా అవమానించేలా మాట్లాడటం బాధాకరమని ప్రముఖ న్యాయవాది, పలాస జిల్లా సాధన కమిటీ కన్వీనర్ దువ్వాడ శ్రీధర్(బాబా) అన్నారు. రాజకీయాల్లో విభేదాలు సహజమేనని, విధానాలను విమర్శించవచ్చని, అయితే వ్యక్తిగత దూషణలకు దిగడం ప్రజాస్వామ్య సంస్కారం కాదని మండిపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లోని అతిపెద్ద సామాజిక వర్గాల్లో ఒకటైన కాపు వర్గానికి చెందిన బొత్స సత్యనారాయణ ఒక్క వర్గానికే పరిమితమైన నాయకుడు కాదని, అన్ని కులాలు, వర్గాల ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ ప్రజానాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. బొత్సపై అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలను ప్రజలు గమనిస్తున్నారని, 2029 ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా ఉంటుందో స్పష్టమవుతుందని దువ్వాడ శ్రీధర్(బాబా) అన్నారు. అహంకారం, అధికారం ద్వారా ప్రజల మనసులను గెలవలేరని హితవు పలికారు. పదవులు, అధికారం శాశ్వతం కాదని, నాయకుల మాటలు, వారి సంస్కారం మాత్రం ప్రజల జ్ఞాపకాల్లో నిలిచిపోతాయని అన్నారు. రాజకీయాల్లో అహంకారానికి కాకుండా సంస్కారానికి విలువ ఉంటుందని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని దువ్వాడ శ్రీధర్ (బాబా) అన్నారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణ ప్రతి పౌరుని బాధ్యత

-ఎస్ఐ అప్పలసూరి




**జి.సిగడాం, ఆగస్టు 20(వార్త):** మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రభావాల పై యువత, విద్యార్థులకు అవగాహన కలిగి ఉండాలని ఎస్.ఐ కొండపల్లి అప్పలసూరి అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఉన్న మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయుల సమక్షంలో అభయం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదకద్రవ్యా లకు బానిసలవడం వల్ల యువత భవిష్యత్ పూర్తిగా నాశనమవుతుందని హెచ్చరించారు. చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మక కార్యక్ర మాల్లో పాల్గొంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.మాదక ద్రవ్యా లను నిర్మూలించి భావితరాలకు ఆరోగ్యకర మైన, సురక్షితమైన భవిష్యత్తును అందించాల నే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా విద్యా సంస్థల్లో చదువుకున్న విద్యార్థులకు నిరంతరం అవగాహన కార్యక్ర మాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.మాదక ద్రవ్యాల బారిన పడుతున్న యువ తను కాపాడేందుకు జిల్లా పోలీస్ శాఖ కృషి చేస్తుందని, అందులో భాగంగా విద్యా సంస్థలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చడం జరుగుతుందన్నారు.మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి అవగాహన పెంపొందించారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం



**జి.సిగడాం, ఆగస్టు 20(వార్త):** పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం అని, పేద కుటుంబాలు వైద్యకోసం దరఖాస్తు చేసిన వెంటనే సీఎం నిధులు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే కుమారుడు తేజా బాబు అన్నారు. నడుకుదిటి ఈశ్వరరావు(ఎన్ఈఆర్ )అదేశాల మేరకు కుమారుడు తేజా బాబు గురువారం మండలంలో 9 మంది అపన్నులకు రూ.34,9863 లక్షలను ఆనందపురం,దేవరవలస, దవళ పేట,గేదెల పేట,ముషినవలస, జాడ,బాతువ, నడిమివలస గ్రామాలకు చెందిన చిత్తిరి హైమావతి రూ.60,762, మక్క ఈశ్వరమ్మ రూ. 28,655, కంచరాన వెంకటరావు రూ.40,000,గేదేల మురళీ మోహన్ రూ.41,201, జరజాపు శంకరరావు రూ.62862, కేతా లక్ష్మీ రూ.20,000, బి. అరుణ జ్యోతిరూ. 62,418,సారోడు ఉష రూ. 26,795 సీఎం సహాయనిధి చెక్కులను ఇంటింటికి వెళ్లి స్థానిక గ్రామ కూటమి నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా అయెన మాట్లాడుతూ అన్ని రంగాలను అభివృద్ధి చేయడంలో కూటమి ప్రభుత్వం ఉంటుందని అన్నారు. వారితో పాటు టిడిపి మండల అధ్యక్షులు కుమరాపు రవికుమార్, మండల పీఎసీఎస్ అధ్యక్షులు బెవర జగన్నాథరావు, నీటి సంఘం అధ్యక్షులు చిత్తిరి తిరుపతిరావు, మీసాల విజయమ్మ, బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకులు వజ్జపర్తి రఘురాం, జనసేన జిల్లా సీనియర్ నాయకులు భూపతి అర్జున్ కుమార్, మాజీ సర్పంచ్ వెంకట్రావు, గోపాల్ కృష్ణం నాయుడు, మీసాల ముసిలి నాయుడు, డబ్బాడ అదినారాయణ, కూనిబిల్లి కూర్మారావు, గేదేల రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో తగాదాలకు తావివ్వొద్దు..!

- 'పల్లె నిద్ర'లో ఎస్ఐ అప్పలసూరి

**జి.సిగడాం, ఆగస్టు 20(వార్త):** గ్రామాల్లో చిన్నచిన్న సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని, తగాదాలకు దిగి సమస్యలు సృష్టిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని ఎస్.ఐ అప్పలసూరి దామోదర్ హెచ్చరించారు. జి.సిగడాం మండలం ఆనందపురం గ్రామంలో గురువారం రాత్రి రామమందిరం వద్ద పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రజా ప్రతినిధులు, నాయకులు,యువత, గ్రామ పెద్దలతో మాట్లాడుతూ పోలీసు అధికారులు, సిబ్బంది దత్తత గ్రామాల్లో బస చేసి ప్రజలతో మమేకమయ్యారు.త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గ్రామాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. సమస్యలు సృష్టించే వారిని గుర్తించి అవసరమైతే బైండోవర్ చేస్తామని తెలిపారు.కులమతాల పేరుతో వివక్షకు పాల్పడినా, కుల దూషణలు చేసినా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం ఉంటే 112 లేదా 1972కు తెలియజేయాలని కోరారు. మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ కట్టుబడి ఉందని, అత్యవసర పరిస్థితుల్లో 'శక్తి' యాప్ను వినియోగించుకోవాలని సూచించారు. యువత బెట్టింగ్, జూదం, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండి, ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాల పైసాగాలని ఎస్పీ పిలుపునిచ్చారు.



జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# 101 జ్యోతులతో దివ్య నామ సంకీర్తన

**- శ్రీ సత్యసాయి బాబా 101వ జన్మదిన వేడుకలకు ఆధ్యాత్మిక శోభ**

**-101 రోజుల దీక్షా కార్యక్రమాల్లో భాగంగా ప్రత్యేక ప్రార్ధనలు**

**పలాస, ఆగస్టు 20 (వార్త):** భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జన్మదినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న 101 రోజుల దీక్షా కార్యక్రమాల్లో భాగంగా గురువారం రామకృష్ణపురంలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌లో ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు. 101 జ్యోతులను వెలిగించి భక్తులు సామూహికంగా దివ్య నామసంకీర్తనలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి బాబా తత్వబోధనలు, సేవా మార్గం, మానవతా విలువలను స్మరించుకున్నారు. జ్యోతుల వెలుగుల మధ్య భక్తులు భజనలు, నామసంకీర్తన నిర్వహించడంతో విద్యావిహార్ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. ఆధ్యాత్మికతతో సేవా స్ఫూర్తితో శ్రీ సత్యసాయి బాబా బోధించిన "ప్రేమించు.. సేవచేయు" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ఉద్దేశంతో 101 రోజుల దీక్షా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తి కార్యక్రమాలతో పాటు సమాజసేవ, మానవతా విలువలు, పరస్పర సహకారం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఈ వేడుకల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 101 జ్యోతుల వెలుగును భక్తి, జ్ఞానం, సేవకు ప్రతీకగా భావిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్నారులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని దివ్య నామసంకీర్తనలో భాగస్వాములయ్యారు.



### ఘనంగా కొనసాగుతున్న వేడుకలు

శ్రీ సత్యసాయి బాబా 101వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ప్రతి దశలోనూ ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల భాగస్వామ్యంతో కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా శ్రీ సత్యసాయి బాబా ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, యువతలో సేవాభావాన్ని పెంపొందించడం, సమాజంలో ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడమే వేడుకల సారాంశమని నిర్వాహకులు పేర్కొన్నారు.

# డిగ్రీ విద్యార్థులకు బొటానికల్ టూర్



**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో చదువుతున్న తృతీయ సంవత్సరం 5వ సెమిస్టర్ విద్యార్థుల కు బొటనికల్ ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా,, బి. కృష్ణ ఆధ్వర్యంలో ఈరోజు బోటనీ విద్యార్థులకు లెక్చరర్ టి.బృందావనం సమీపాన వున్న తెలుకుంచి గ్రామంలో పంటపొలాల పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పుస్తకాలకే పరిమితం కాకుండా, రైతు కష్టాలు చూడడానికి ఒకరోజు పుడమిపై కాలు మోపిన మా విద్యార్థులు, ఒక గింజ మన చేతికి అన్నంగా చేరేవరకు పడే శ్రమను మా విద్యార్థులు తెలుసుకున్నారు అని కొనియాడారు. విద్యార్థులు స్వయంగా వ్యవసాయ పంటల పెంపకం గూర్చి పంటలకు వచ్చే వ్యాధులు మరియు వాటికి తీసుకునే జాగ్రత్తలను రైతులకు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణ, దుర్యోధన దోలాయి, శివకుమార్, సంతోష్, ఈశ్వర్,లోకేష్, దేవరాజ్ పాల్గొన్నారు.

# దోమలపై అప్రమత్తతతోనే వ్యాధుల నివారణ

**- ఉర్లాంలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అవగాహన ర్యాలీ**

**- పరిసరాల పరిశుభ్రతతో దోమల ఉత్పత్తిని అరికట్టాలి**

**- వైద్యాధికారి సూచన - మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించిన ఆరోగ్య సిబ్బంది**



**నరసన్నపేట, ఆగస్టు 15 (వార్త):** దోమల ద్వారా మలేరియా, డెంగీ వంటి పలు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మెండ శాలిని సూచించారు. దోమల పట్ల అవగాహన కల్పించడంతో పాటు వ్యాధుల నివారణకు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలనే ఉద్దేశంతో గురువారం నరసన్నపేట మండలం ఉర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉన్నందున ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. నీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు దోమల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ముఖ్యంగా ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మలేరియా వ్యాధి సోకే అవకాశం ఉంటుందని వివరించారు. జ్వరం, వణుకు, శరీర నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ప్రజలకు సూచించారు. దోమల వ్యాధుల నివారణలో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్లు గణపతిరావు, వెంకటరమణ, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫొటోగ్రాఫర్ల ఆధ్వర్యంలో అన్నదానం




**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** ఇచ్ఛాపురం ఫోటో, వీడియో గ్రాఫర్ ల అసోసియేషన్ ఆధ్వర్యంలో వరల్డ్ ఫోటోగ్రాఫీ డే సందర్భంగా ఇచ్ఛాపురం కు సమీపాన ఉన్న కొనిసి (ఒడిశా )నవజీవన్ సేవాశ్రం లో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమం లో ఫోటో వీడియో గ్రాఫర్ లు పాల్గొన్నారు.

# ఇంటింటికీ తెలుగుదేశం



**ఇచ్ఛాపురం, ఆగస్టు 20(వార్త):** కేశుపురం కొలనీలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం రెండేళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమంలో భాగంగా మండల ప్రధాన కార్యదర్శి నాటక అకాడమీ డైరెక్టర్ దక్కత కామేశ్వరరావు రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు

కార్యదర్శి గుజ్జు భీమరాజు రెడ్డి సీనియర్ నాయకులు మాసుపత్రి నీలాద్రి రెడ్డి, నరేంద్ర రెడ్డి నీలాపు వాల్మీకి రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

11 వ వార్డు లో జిల్లా తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి ఆసి లీలా రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు.

# రాజకీయాల్లోకి వచ్చి సేవ చేయాలా? ప్రజలే నిర్ణయించాలి

**- పలాస నియోజకవర్గ ప్రజలను కోరిన ఎంఎస్ యాదవ్**



**పలాస, ఆగస్టు 20 (వార్త):** "ప్రజలే దేవుళ్లు.. సమాజమే దేవాలయం" అనే నినాదంతో ప్రజాసేవలో కొనసాగుతున్నానని, రాజకీయాల్లోకి వచ్చి మరింత సేవ చేయాలా? వద్దా? అనే విషయాన్ని పలాస నియోజకవర్గ ప్రజలే నిర్ణయించాలని ఎంఎస్ యాదవ్ కోరారు. ఈ మేరకు పలాస నియోజకవర్గ కుటుంబ సభ్యులను ఉద్దేశించి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పలాస నియోజకవర్గంలో వందలాది మంది డిగ్రీ చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించానని తెలిపారు. ప్రస్తుతం పలువురు నెలకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వేతనాలు పొందుతున్నారని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు, ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సహాయం, మందులు, నిత్యావసర సరుకులు అందిస్తూ అండగా నిలుస్తున్నానన్నారు. కోవిడ్ సమయంలో ఆస్తులు అమ్మి.. కోవిడ్ కష్టకాలంలో పలాస నియోజకవర్గంలోని పేద ప్రజలకు తన వంతు సాయం అందించేందుకు ఆస్తులు విక్రయించడంతో పాటు బంగారం తాకట్టు పెట్టి పేద కుటుంబాలకు అండగా నిలిచానని ఎంఎస్ యాదవ్ తెలిపారు. "చదువుకుంటాను.. చదివించు అన్నయ్య" అని కోరిన విద్యార్థులను కూడా చదివించిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. పేద ప్రజలకు అండగా ఉండటం, వారికి భరోసా కల్పించడమే తన లక్ష్యమని, రాజకీయాలు అంటే పదవి కోసం కాకుండా ప్రజాసేవ కోసం అనే నమ్మకంతో రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నట్లు వెల్లడించారు.

### ఎర్రంనాయుడు స్ఫూర్తితో..

స్వర్గీయ కింజరాపు ఎర్రంనాయుడు తనకు స్ఫూర్తి, గురువుగా నిలిచారని ఎంఎస్ యాదవ్ పేర్కొన్నారు. తన వ్యక్తిత్వాన్ని, నిజాయితీని ఎక్కడా తాకట్టు పెట్టకుండా పలాస నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీతో పాటు నియోజకవర్గ ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావిస్తున్నానని, వారి అభిప్రాయమే తనకు ముఖ్యమని చెప్పారు.

# సామాజిక న్యాయ సాధన దిశగా ప్రభుత్వ నిర్ణయం

**- టీడీపీ జిల్లా పార్లమెంటరీ అధికార ప్రతినిధి దువ్వాడ హేమబాబు చౌదరి హర్షం**



**పలాస, ఆగస్టు 20 (వార్త):** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ జిల్లా పార్లమెంటరీ అధికార ప్రతినిధి దువ్వాడ హేమబాబు చౌదరి స్వాగతించారు. గురువారం పలాసలో ఆయన స్వగృహంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ సాధికారత లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. బీసీలకు రాజకీయంగా అత్యధిక ప్రాధాన్యం కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని పేర్కొన్నారు. 34 శాతం రిజర్వేషన్ అమలుతో గ్రామపంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ నుంచి మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేషన్ డివిజన్ సభ్యుల వరకు బీసీలకు మరింత ప్రాతినిధ్యం లభిస్తుందని తెలిపారు. గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పాలనా వ్యవస్థలో బీసీల భాగస్వామ్యం పెరుగుతుందని అన్నారు. తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర స్థానిక సమస్యలపై బీసీ ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. దీంతో ప్రజలకు మరింత చేరువగా, జవాబుదారీతనంతో కూడిన పాలన అందే అవకాశం ఉందన్నారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్లతో పాటు విద్య, ఉపాధి, ఆర్థికాభివృద్ధి, సంక్షేమ రంగాల్లోనూ ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని హేమబాబు చౌదరి తెలిపారు. బీసీ విద్యార్థులకు విద్యా అవకాశాలు, వసతిగృహాల అభివృద్ధి, యువతకు స్వయం ఉపాధి, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీలకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పిస్తోందని గుర్తుచేశారు. ఎన్టీఆర్ హయాంలో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేసిన చరిత్ర టీడీపీకి ఉందన్నారు. ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలో అదే స్ఫూర్తితో బీసీల రాజకీయ సాధికారతకు మరింత ప్రాధాన్యం లభిస్తోందని అన్నారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో సామాజిక సమతుల్యత మరింత బలోపేతం అవుతుందని, బీసీ యువత రాజకీయాల్లోకి రావడానికి ప్రోత్సాహం లభిస్తుందని హేమబాబు చౌదరి పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు పెద్ద సంఖ్యలో పోటీ చేసి ప్రజాసేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాజకీయంగా మరింత ఎదగాలని ఆకాంక్షించారు.

# రాజీవ్‌గాంధీకి ఘన నివాళులు



**- శ్రీముఖలింగం రాజీవ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు**

**- రిమ్స్ ఆసుపత్రి ఆవరణలోని విగ్రహానికి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు**

**- ఆధునిక సాంకేతిక, పంచాయతీరాజ్ వ్యవస్థల అభివృద్ధిలో రాజీవ్ సేవలు చిరస్మరణీయం**

**జలుమూరు, ఆగస్టు 20 (వార్త):** మాజీ ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని రాజీవ్ భవన్‌లో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు, శ్రీకాకుళం పార్లమెంట్ మాజీ అభ్యర్థి నాయుడుగారి రాజశేఖర్, జలుమూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు, శ్రీముఖలింగం మాజీ సర్పంచ్ గుంట కర్ణవీరుడు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన రాజీవ్‌గాంధీ విగ్రహానికి డీసీసీ ఉపాధ్యక్షుడు ఇజ్జరౌతు రమణ, ఎచ్చెర్ల, రణస్థలం మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి రాజశేఖర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ దేశానికి అందించిన సేవలను కాంగ్రెస్ నాయకులు స్మరించుకున్నారు. నాయుడుగారి రాజశేఖర్ మాట్లాడుతూ దేశంలో ఆధునిక సాంకేతిక రంగం అభివృద్ధికి రాజీవ్‌గాంధీ బలమైన పునాదులు వేశారని కొనియాడారు. కంప్యూటర్, సాంకేతిక పరిజ్ఞానం విస్తరణకు ఆయన తీసుకున్న నిర్ణయాలు దేశ అభివృద్ధికి దోహదపడ్డాయని అన్నారు. మహిళల ఆర్థిక సాధికారత, స్వయం ఉపాధి అవకాశాల పెంపునకు స్వయం సహాయక సంఘాల భావనకు ప్రోత్సాహం లభించిందని పేర్కొన్నారు. గుంట కర్ణవీరుడు మాట్లాడుతూ యువత రాజకీయాల్లో చురుకుగా పాల్గొనేలా రాజీవ్‌గాంధీ చేపట్టిన సంస్కరణలు ఎంతో ప్రాధాన్యత కలిగినవని అన్నారు. ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించడం ద్వారా దేశ యువతకు రాజకీయ ప్రక్రియలో భాగస్వామ్యం అయ్యే అవకాశం కల్పించారని తెలిపారు. అస్సాం, పంజాబ్ వంటి ప్రాంతాల్లో శాంతి, సామరస్య స్థాపనకు ఆయన చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి స్థానిక సంస్థలకు అధిక ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో రాజీవ్‌గాంధీ అనేక సంస్కరణలకు పునాదులు వేశారని పేర్కొన్నారు. దేశ ఆధునికీకరణ, యువత సాధికారత, సాంకేతిక అభివృద్ధి దిశగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



# జగన్‌తో సీదిరి భేటీ

- అండగా ఉంటానన్న మాజీ సీఎం
- జైలు కష్టాలను జగన్‌కు వివరించిన మాజీ మంత్రి
- ధైర్యంగా ముందుకు సాగాలని సూచించిన వైఎస్సార్సీపీ అధినేత
- అక్రమ కేసులకు భయపడేది లేదన్న సీదిరి



**పలాస, ఆగస్టు 20 (వార్త):** పలాస నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు బుధవారం తాడేపల్లిలో వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కుటుంబ సమేతంగా మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల బెయిల్‌పై విడుదలైన సీదిరి.. తన 23 రోజుల జైలు జీవితం, ఎదురైన ఇబ్బందులు, కుటుంబ సభ్యులు పడిన మానసిక వేదనను జగన్‌కు వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీదిరి అప్పలరాజు, ఆయన కుటుంబ సభ్యులకు జగన్ ధైర్యం చెప్పారు. రాజకీయంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అధైర్యపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించినట్లు సీదిరి తెలిపారు. వైఎస్సార్సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని జగన్ పేర్కొన్నట్లు చెప్పారు. పార్టీ పరంగా, న్యాయపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చినట్లు తెలిపారు. తనను రాజకీయంగా ఎదుర్కోలేకనే పలాసలో ప్రత్యర్థులు కుట్రపూరితంగా కేసులు పెట్టించారని సీదిరి ఆరోపించారు. ప్రజల్లో తనకు ఉన్న ఆదరణను చూసి ఓర్వలేకే వేధింపులకు పాల్పడుతున్నారని జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్రమ కేసులు, జైలు నిర్బంధం, బెదిరింపులకు భయపడేది లేదని, జగన్ నాయకత్వంలో ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. అనంతరం సీదిరి కుటుంబ సభ్యులతో కలిసి జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. సందర్భంగా పలాస రాజకీయాలు పరిస్థితులపై ఆరా తీశారు.

## చల్లవానిపేటలో రాజీవ్‌గాంధీ జయంతి వేడుకలు

- ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు
- సాంకేతిక, విద్యా రంగాల అభివృద్ధికి రాజీవ్ చేసిన సేవలు చిరస్మరణీయం



**జలుమూరు, ఆగస్టు 20 (వార్త):** మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గంలోని చల్లవానిపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో సాంకేతిక రంగం అభివృద్ధికి రాజీవ్‌గాంధీ బలమైన పునాదులు వేశారని కొనియాడారు. ఆధునిక సాంకేతికతను ప్రజలకు చేరువ చేయడంతో పాటు దేశ యువతకు కొత్త దిశానిర్దేశం చేసిన నాయకుడిగా ఆయనను గుర్తుంచుకోవాలని అన్నారు. విద్య, ఉపాధి రంగాల అభివృద్ధికి రాజీవ్‌గాంధీ తీసుకున్న చర్యలు యువతలో కొత్త ఆశలు నింపాయని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందనే నమ్మకంతో యువతకు అవకాశాలు కల్పించేందుకు ఆయన కృషి చేశారని తెలిపారు. ఆధునిక భారత నిర్మాణంలో రాజీవ్‌గాంధీ పాత్ర విశిష్టమైందని, ఆయన ఆశయాలను కొనసాగించడం ద్వారా యువత అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి భేరి వెంకటరమణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొని రాజీవ్‌గాంధీకి నివాళులర్పించారు.

## విలేజీ హెల్త్ క్లినిక్

- తలసముద్రంలో ప్రారంభానికి నోచుకోని వైనం
- నిరుపయోగంగా సుమారు రూ.20 లక్షలతో నిర్మించిన భవనం
- ప్రారంభం కాకముందే బీటలు
- మరమ్మతులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తేవాలని గ్రామస్థుల విజ్ఞప్తి

**పోలాకి, ఆగస్టు 15 (వార్త):** తలసముద్రం గ్రామంలో సుమారు రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం ప్రారంభానికి నోచుకోకుండానే నిరుపయోగంగా మారింది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్మించిన ఈ భవనం ఇప్పటివరకు వినియోగంలోకి రాకపోవడంపై గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్లినిక్ భవనాన్ని చెరువును పూడ్చి నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారనే ఆరోపణలు ఉన్నాయని గ్రామస్థులు తెలిపారు. నిర్మాణ స్థలానికి సంబంధించిన అంశాలపై అప్పట్లోనే సందేహాలు వ్యక్తమైనప్పటికీ, ప్రస్తుతం భవనం ప్రారంభానికి ముందే బీటలు వారుతుండటం ఆందోళన కలిగిస్తోంది. కోట్ల రూపాయలు కాకపోయినా ప్రజాధనం అయిన సుమారు రూ.20 లక్షలు ఖర్చు చేసి నిర్మించిన భవనం వినియోగానికి రాకుండా ఉండటం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామంలోని ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు మరింత చేరువ కావాలనే ఉద్దేశంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్మించినప్పటికీ, అది అందుబాటులోకి రాకపోవడంతో ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదని స్థానికులు పేర్కొన్నారు. భవనానికి అవసరమైన మరమ్మతులు చేపట్టి, నిర్మాణంలో ఉన్న లోపాలను సరిచేసి త్వరితగతిన ప్రారంభించాలని కోరుతున్నారు. ప్రజాధనం వృథా




కాకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి భవనాన్ని పరిశీలించాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేశారు. అవసరమైన సాంకేతిక మరమ్మతులు చేపట్టి క్లినిక్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తే గ్రామస్థులకు వైద్య సేవలు మరింత సులభంగా లభించే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.



## అర్హులందరికీ ప్రభుత్వ ప్రయోజనాలు

- ఆర్‌ఓబీ లబ్ధిదారులకు పట్టాల పంపిణీ
- రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ బాబూరావు

**పలాస, ఆగస్టు 20 (వార్త):** పలాస నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు ఆర్‌ఓబీ నిర్మాణం, అభివృద్ధి పనుల వల్ల ప్రభావితమైన లబ్ధిదారులకు గురువారం పట్టాలు పంపిణీ చేశారు. రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ ఆర్‌ఓబీ నిర్మాణం నేపథ్యంలో ప్రభావితమైన కుటుంబాలకు న్యాయం చేయడమే ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష చొరవ అభినందనీయమన్నారు. పట్టాలు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఎమ్మెల్యే గౌతు శిరీషతో పాటు సహకరించిన టీడీపీ నాయకులు, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ.. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని నాయకులు తెలిపారు. ఎమ్మెల్యే గౌతు శిరీష నాయకత్వంలో పలాస నియోజకవర్గ అభివృద్ధికి కృషి కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి టౌన్ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, టిడిపి కార్యదర్శి నవీన్ సప్ప, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి లోడగల కామేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, క్లస్టర్ కన్వీనర్లు గాలి కృష్ణారావు, రాంబాబు సవర, వార్డు ఇన్చార్జులు కొరికాన శంకర్‌రావు, దొక్కరి శంకర్, ఆర్‌ఓబీ లబ్ధిదారులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సాంకేతిక విప్లవ వారధి రాజీవ్‌గాంధీ

- రిమ్స్ మెడికల్ కళాశాల ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు
- యువతకు ఓటు హక్కుపై రాజీవ్ సేవలను స్మరించిన కాంగ్రెస్ నాయకులు
- గ్రామీణాభివృద్ధికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడిన డీసీసీ అధ్యక్షుడు

**శ్రీకాకుళం, ఆగస్టు 20 (వార్త):** భారతరత్న, మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా రిమ్స్ మెడికల్ కళాశాల ఆవరణలోని ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ దేశ అభివృద్ధి, సాంకేతిక రంగం, యువత సాధికారత, గ్రామీణాభివృద్ధికి అందించిన సేవలను నాయకులు స్మరించుకున్నారు.

డీసీసీ అధ్యక్షుడు సనపల అన్నాజీరావు మాట్లాడుతూ భారతదేశంలో సాంకేతిక విప్లవానికి బాటలు వేసి, దేశాన్ని ప్రపంచ దేశాలతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లడంలో రాజీవ్‌గాంధీ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఆయన దూరదృష్టితో తీసుకున్న నిర్ణయాలు దేశ పురోగతికి దోహదపడ్డాయని పేర్కొన్నారు. గ్రామ స్వరాజ్య సాధన కోసం రాజీవ్‌గాంధీ 73వ, 74వ రాజ్యాంగ సవరణలకు కృషి చేసి స్థానిక సంస్థలకు మరింత ప్రాధాన్యం కల్పించారని తెలిపారు. కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు నిధులు అందేలా చర్యలు తీసుకోవడం ద్వారా గ్రామాల అభివృద్ధికి బాటలు వేశారని అన్నారు. గ్రామీణ స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయాలన్న ఆయన ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. 18 సంవత్సరాల వయసుకే ఓటు హక్కు కల్పించడం ద్వారా యువతకు రాజకీయంగా, సామాజికంగా మరింత ప్రాధాన్యం ఇచ్చిన నాయకుడు రాజీవ్‌గాంధీ అని సనపల అన్నాజీరావు కొనియాడారు. యువతను దేశ నిర్మాణంలో భాగస్వాములను చేయాలన్న ఆయన ఆశయం నేటి తరానికి మార్గదర్శకమని అన్నారు. కార్యక్రమంలో మాజీ డీసీసీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రెల్ల సురేష్, మాజీ డీసీసీ ఉపాధ్యక్షులు కెవీఎల్ఎస్ ఈశ్వరి, ఇజ్జురోతు రమణ, నియోజకవర్గ కోఆర్డినేటర్లు ఆబోతుల వెంకటనాయుడు, బొచ్చ వెంకటరమణ, ఎస్సీ సెల్ నాయకుడు కూరాకుల వెంకటరావు, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు చాన్‌భాష, గొల్లపల్లి దాలయ్య, గుంట బారిక అప్పారావు, వేదాంతం తిరుమలరావు, కోడూరు విజయకుమార్, నాయుడు రాజశేఖర్, గుంట కర్ణవీరుడు, జీపీ నాయుడు తదితరులు పాల్గొని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.






## వీబీజీ రామ్ జీ చట్టంపై శిక్షణ

- ప్రజాప్రతినిధులు, పంచాయతీ ప్రత్యేక అధికారులకు ఒకరోజు శిక్షణ
- ఉపాధి హామీ పనిదినాలను 125 రోజులకు పెంచే అంశంపై అవగాహన
- నీటి భద్రత, మౌలిక సదుపాయాలు, జీవనోపాధి పనులకు ప్రాధాన్యం



**జలుమూరు, ఆగస్టు 20 (వార్త):** జలుమూరు మండలంలో వీబీజీ రామ్ జీ చట్టంపై ప్రజాప్రతినిధులు, పంచాయతీ ప్రత్యేక అధికారులకు శనివారం ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులతో పాటు పంచాయతీల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ బి. చిన్నమ్ముడు మాట్లాడుతూ గతంలో ఉపాధి హామీ పథకంలో కుటుంబాలకు ఏడాదికి 100 రోజుల పనికి అవకాశం ఉండేదని, ప్రస్తుతం దానిని 125 రోజులకు పెంచే విధానంపై శిక్షణలో వివరించినట్లు తెలిపారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ పనులు అధికంగా ఉండే కాలంలో 60 రోజులను సెలవు దినాలుగా ప్రకటించే అంశంపై కూడా అవగాహన కల్పించారు. ఉపాధి పనుల అమలులో రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొనే ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆయా నిబంధనలను అమలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించే విధానంపై శిక్షణలో వివరించారు. అలాగే గ్రామ పంచాయతీలను ఏ, బీ, సీ కేటగిరీలుగా వర్గీకరించే ప్రక్రియ, పంచాయతీల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇవ్వడంపై చర్చించారు. ప్రస్తుతం 318 రకాల పనులకు ఆమోదం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా నీటి భద్రత, మౌలిక సదుపాయాల కల్పన, జీవనోపాధి మెరుగుదల, విపత్తుల నిర్వహణకు సంబంధించిన పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్రాభివృద్ధి, ఉపాధి కల్పనతో పాటు ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని వివరించారు. ఈ శిక్షణ ద్వారా ప్రజాప్రతినిధులు, పంచాయతీ ప్రత్యేక అధికారులు చట్టంలోని నిబంధనలు, నిధుల కేటాయింపు విధానం, అమలు చేయాల్సిన అభివృద్ధి పనులపై స్పష్టమైన అవగాహన పొందారని అధికారులు తెలిపారు. గ్రామాల అవసరాలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులను చేపట్టాలని సూచించారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546